



తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం శాస్త్రోక్తంగా కొనసాగుతున్నది. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రమంతా రాజశ్యామల అమ్మవారి మూల మంత్రాలతో మార్మోగుతున్నది. వేద మంత్రోచ్చారణల మధ్య యాగం నిర్విఘ్నంగా సాగుతున్నది. గురువారం రెండో రోజు యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శికామ సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి అవతారానికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు ప్రత్యేక హారతులు ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు రాజశ్యామల యంత్రానికి, సుబ్రహ్మణ్య షడావరణ యంత్రానికి పూజలు చేశారు.

# ఈ ఎన్నికల్లో.. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

**మల్కాజిగిరిని దత్తత తీసుకుంటా..**

**ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి హరీశ్ రావు**



మల్కాజిగిరి ఆత్మీయ సమ్మేళన సభలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, నవంబర్ 2 : కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు చెప్పినా...బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై గ్లోబల్ ప్రచారం చేసినా...మంచే గెలుస్తుందని, చివరికి ధర్మమే నిలబడుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మల్కాజిగిరిని తాను దత్తత తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. గురువారం మల్కాజిగిరిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న విమర్శలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్‌లో గొడవలు, మత కలహాలతో ఎంతోమంది ప్రజలను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటి పెద్దగా రాష్ట్రాన్ని, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ, తాగునీటి, కరెంట్ కష్టాలు తీర్చారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రేమ...దయా గుణంతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని చెప్పారు. తలసరి ఆదాయం, ధాన్యం ఉత్పత్తి, ఐటీ ఉద్యోగాల కల్పన ప్రతి రంగంలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని అన్నారు. రాష్ట్రంలో కరువు.. హైదరాబాద్‌లో కర్ఫ్యూ పరిస్థితులు తలెత్తకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సీఎం అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. బీఆర్‌ఎస్ 75-80 సీట్లలో విజయం సాధిస్తుందని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి మల్కాజిగిరిని పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. నిన్నమొన్నటి వరకు కేసీఆర్ గొప్ప అని మాట్లాడిన మైనంపల్లి హన్మంతరావు తన కొడుకు టికెట్ ఇవ్వకపోయేసరికి..స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మైనంపల్లికి దమ్ము లేదని, మైనం'పిల్లి'గా అభివర్ణించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులపై బేగంపేట పీఎస్‌లో కేసు నమోదు

బేగంపేట, నవంబర్ 2: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రాక సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఊరేగింపు నిర్వహించిన టీడీపీ నాయకులపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ కథనం ప్రకారం.. చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి గన్నవరం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. ఈక్రమంలో టీడీపీ నగర కార్యదర్శి జీవీజీ నాయుడు, మరికొందరు కలిసి బైక్‌లు, కార్లతో సుమారు 400 మంది ఊరేగింపుగా వెళ్లారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ఎలాంటి అనుమతి లేకుండా ఊరేగింపు నిర్వహించారంటూ అక్కడ బందోబస్తులో ఉన్న బేగంపేట పీఎస్ ఎస్ఐ జయచందర్ ఫిర్యాదు చేశారు. ఊరేగింపు కారణంగా బేగంపేట నుంచి పంజాగుట్ట వరకు సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించి, ప్రజలు అసౌకర్యానికి గురయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఊరేగింపు నిర్వహించిన నాయుడుతోపాటు ఇతరులపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## నిరుపేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

**ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**



కాంగ్రెస్ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డికి గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, నవంబర్ 2 : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదో డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా చైర్ పర్సన్ సునీతారెడ్డి, మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మావతి పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లారిటీ లేని కమలం..!!

- మూడో జాబితాలోనూ గ్రేటర్‌లో మరో 5 సీట్లు పెండింగ్
- నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ షురూ

సిటీబ్యూరో, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్నా.. ఇంకా కమలానికి క్లారిటీ రావడం లేదు. అభ్యర్థులను ప్రకటించడానికి మల్లగుల్లాలు పడుతున్నది. మూడు జాబితాలు విడుదల చేసినా ఇంకా పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించలేకపోయింది. ముఖ్యంగా గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాల్లో ఐదు సీట్లు ఇంకా ఖరారు చేయలేకపోయింది. తాజాగా బీజేపీ విడుదల చేసిన మూడో జాబితాలోనూ గ్రేటర్‌లో పూర్తి స్థాయిలో టికెట్లు ఖరారు కాలేదు. దీంతో ఆశావహులు కాషాయం పెద్దలపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్‌లో 24 స్థానాల్లో 19 స్థానాలకు మాత్రమే సీట్లు ఖరారు చేసింది. జనసేన పొత్తు కూడా కాషాయంలో చిచ్చు పెట్టింది. గ్రేటర్‌లో అధిక స్థానాలు తమకే కేటాయించాలని పవన్ కల్యాణ్ పట్టుబట్టడంతో బీజేపీ కొన్ని స్థానాలను ప్రకటించలేకపోతున్నది. ఇప్పటికే ఆ స్థానాల నుంచి దరఖాస్తు చేసుకున్న ఆశావహులు జనసేన పొత్తును వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు బీజేపీ గ్రేటర్‌లో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి, నాంపల్లి, కంటోన్మెంట్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. ఇప్పటికే ఈ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పార్టీకి రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. ఆశావహులంతా నాంపల్లి రాష్ట్ర కార్యాలయానికి చక్కర్లు కొడుతున్నారు.

### ప్యారా షూట్ నేతకు టికెట్ ఇచ్చారంటూ..

అంబర్‌పేట్ నుంచి కృష్ణ యాదవ్‌కు టికెట్ ఇవ్వడంపై బీజేపీ కోసం ఇన్నేండ్లు పనిచేసిన నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతం రావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి అంబర్‌పేట్ నుంచి టికెట్ ఆశించారు. కానీ వారిని బీజేపీ పట్టించుకోలేదు. ప్యారా షూట్ నేతకు టికెట్ ఇచ్చారంటూ వారంతా పెదవి విరుస్తున్నారు. గతంలో కృష్ణ యాదవ్ స్టాంపుల కుంభకోణంలో అరెస్టయిన విషయం తెలిసిందే. మరోవైపు మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్‌కు గోషా మహల్ కేటాయిస్తామని చెప్పి రాజాసింగ్‌కు అప్పగించడంతో అతనికి జూబ్లీహిల్స్ కేటాయిస్తామని మాటిచ్చారు. కానీ చివరికి జూబ్లీహిల్స్‌ను కూడా దీపక్ రెడ్డికి కేటాయించడంతో బీజేపీ ఆయనకు కూడా మొండిచెయ్యిచ్చింది.

## ఐటీ సోదాలు

బడంగ్‌పేట్, నవంబర్ 2: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్‌లో ఉన్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఇంట్లో, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి నివాసంలో ఐటీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఐటీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తిరుపతిలో ఉండగా, చిగురింత నర్సింహారెడ్డి ఢిల్లీలో ఉన్నారు. ఐటీ దాడులు చేస్తున్న సమయంలో వారు ఇంట్లో లేరు. పారిజాత నర్సింహారెడ్డిని తిరుపతిలో అదుపులోకి తీసుకున్నారు. చిగురింత నర్సింహారెడ్డిని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని.. ఆయన నివాసానికి తీసుకొచ్చారు.